ప్రజాశక్తి

బుధవారం 7 ఫిబ్రవరి 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో అబ్దుల్ నజీర్ తదితరులు

ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషి

వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ అబ్దుల్ నజీర్

నదిపై వంతెనలకు నిధులు వచ్చేనా?

నేడు అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టనున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో జిల్లాలో పెండింగ్లో ఉన్న అభివద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం నిధులు ఎంతవరకు కేటాయిస్తుందనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. గత ఐదు బడ్జెట్లలో నామమాత్రంగా నిధులు కేటాయింపు జరిగినా.. పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం లభించలేదు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ త్వరలో రానున్న నేపథ్యంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్లోనైనా కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత నాలుగేళ్లుగా జిల్లాలో చేపట్టిన వివిధ అభివద్ధి పనులకు సంబంధించి కోట్లాది రూపాయలు బిల్లులు నిలిచిపోయాయి. బడ్జెట్లో ఏ మేరకు జిల్లాకు నిధులు కేటాయిస్తారో, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం ఏ విధంగా

స్పందిస్తుందో అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

కృష్ణానదిపై కృష్ణాజిల్లా పెనమలూరు మండలం చోడవరం, మోపిదేవి మండలం బండికొళ్లంక బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి డిపిఆర్‌లు గతంలోనే పూర్తయ్యాయి. అయితే నిధుల కోసం ప్రభుత్వానికి పంపిన డిపిఆర్‌లు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే అవనిగడ్డ నియోజకవర్గంలో ఏడు అవుట్ ఫాల్ (మిగతా 6లో)

కుమార్తెపై అత్యాచారం కేసులో తండ్రికి జీవితఖైదు

ప్రజాశక్తి - విజయవాడ : బాలిక అయిన కుమార్తెపై అత్యాచారం చేసిన కేసులో తండ్రికి జీవితకాల జైలు (మరణించేవరకు) శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ మంగళవారం విజయవాడ పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి డాక్టర్ ఎస్.రజిని తీర్పుచెప్పారు. కేసు నమోదు చేసిన 13 నెలల్లో నిందితుడికి ఎన్‌టిఆర్ జిల్లా పోలీసులు శిక్ష పడేలా చేశారు. విజయవాడ మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగిరెద్దుల దిబ్బ వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఫిర్యాది అయిత బాలిక తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆమె తన భర్త, ఇద్దరు బాలికలతో నివసిస్తోంది. ఇద్దరు బాలికలు హాస్టల్‌లో ఉంటూ గన్నవరంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో 8వ తరగతి చదువుకుంటున్నారు. అయితే గత ఏడాది జనవరి 10వ తేదీన ఇద్దరు బాలికల్లో ఒకరిని తండ్రి తనబైక్‌పై తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అంతేగాక బాలికకు పదేళ్ల వయస్సు నుండి ఆమెపై తండ్రి అత్యాచారం చేస్తున్నట్లుగా విచారణలో వెల్లడైంది. ఎవరికైనా చెప్తే చంపేస్తానని బాలికను బెదిరిస్తూ వస్తున్నాడు. దీంతో గత ఏడాది జనవరి 12న తన భర్త నిద్రిస్తున్న సమయంలో బాలిక తల్లి ఇంటినుండి పిల్లలతో సహా బయటకు వచ్చి దిశ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దిశ పోలీసులు సిఆర్ నెంబరు 5/2023 యుఎస్ 376 (ఎబి), 376 (3) ఐపిసి, సెక్షన్ 6 ఆఫ్ పోస్కో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. దిశ ఎసిపి వి.వి.నాయుడు విచారణ జరిపి అదే నెల 13న నిందితుడైన కరారి నాగరాజును అరెస్ట్ చేసి ఛార్జిషీటు నమోదు చేశారు. డిజిపి కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఇటువంటి కేసులను తీవ్ర నేరంగా పరిగణించి త్వరగా ట్రయిల్ పూర్తయ్యేవిధంగా, నిందితుడికి శిక్ష పడేలా చేయాలని అధికారులకు, సిఎంఎస్ సిబ్బందికి పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ (మిగతా 6లో)

భారత్ రంగస్థల మహోత్సవ్ ప్రారంభం

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : నగరంలో భారత్ రంగస్థల మహోత్సవ్ మంగళవారం ప్రారంభమైంది. న్యూఢిల్లీకి చెందిన నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 25వ భారత్ రంగస్థల హోత్సవాలు-2024ను నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు దేశవ్యాప్తంగా 15 నగరాల్లో నిర్వహిస్తున్న నాటక మహోత్సవాల్లో భాగంగా ఎంపిక చేసిన ఆరు అత్యుత్తమ నాటికలను మంగళవారం నుంచి ఆదివారం వరకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రతి రోజూ సాయంత్రం ప్రదర్శిస్తున్నారు. మంగళవారం జరిగిన ప్రారంభోత్సవంలో రాష్ట్ర ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ నాటక రంగం పూర్వవైభవం సంతరించుకోవాలంటే నాటక మహోత్సవాలు పెద్దఎత్తున జరగాలని ఆకాంక్షించారు. విజయవాడలో రెండోసారి జాతీయ స్థాయి నాటక మహోత్సవాలు జరగటం అభినందనీయమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్. కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా మన దేశంలో ఆరు దశాబ్దాలకు పైగా విశేష సేవలు అందిస్తోందన్నారు. భారత్ రంగస్థల మహోత్సవ్‌లో భాగంగా మొదటి రోజు ఎన్.డీ. రిపర్టరీ కంపెనీ, న్యూఢిల్లీ

నాటిక ప్రదర్శనలో కళాకారులు; మహోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ విష్ణు

వారి 'మై రి మె కా సె కహూ' నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకానికి ఆధారం విజయదాన్ దేతా రాసిన దువిధ కథ. సమాజంలో స్త్రీ తన కోరికలు, భావోద్వేగాలు, సామాజిక నిబంధనల మధ్య పడే సంఘర్షణే ప్రధాన ఇతివత్తింగా తీసుకుని దీనిని ప్రదర్శించారు. ఈ నాటకం ఆద్యంతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ముందుగా ముఖ్యఅతిథులను శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా రెస్పెక్టరీ చీప్ రాజేష్ సింగ్, సాంస్కృతిక శాఖ డైరక్టర్ మల్లికార్జునరావు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా అసిస్టెంట్ ప్రొఫెసర్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాలపు ఒప్పంద జీఓలను వెంటనే విడుదల చేయాలి

ఎపి మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - విజయవాడ : సమ్మె కాలపు ఒప్పంద జీవోలను వెంటనే ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికుల స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాల కోసం వేసిన కమిటీ నివేదికను విడుదల చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు జీతాల పెంపు కోసం జాయింట్ యాక్షన్ కమిటీ వెయాలని కోరుతూ మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర

మున్సిపల్ కార్మికుల ధర్నాలో కె.ఉమామహేశ్వరరావు,ల సిహెచ్.బాబూరావు, తదితరులు

కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వర మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వేసిన కమిటీతో సలహాలు సూచనలు సంప్రదింపులు చేయాలన్నారు. సమ్మె జరిగిన నెలరోజుల వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. అలాగే సమ్మె ఒప్పందపు జీవో కాపీలు కూడా వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులకు వెంటనే పుల్ జీతం కూడా వేయాలని అన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్ సెమీ స్కిల్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరల ఆందోళనకు, సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మద్దతు తెలిపి మాట్లాడుతూ సమ్మె కాలంలో ఒప్పుకున్న ఒప్పంద జీవో కాపీలు ప్రభుత్వం ఇవ్వాలని, వాటిని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, సమ్మె కాలాన్ని జీతానికీ, సాధారణ పండగ సెలవులకు ఆదివారం పుల్ డే సెలవుకు లింకు పెట్టడం తగదన్నారను. సమ్మె కాలంలో పోగుబడిన చెత్తనంతా మున్సిపల్ కార్మికులే తరలించారని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్ మాట్లాడుతూ నగరంలో మస్తానీ టైము 5.30 నుండి 5:45 గంటల వరకు గ్రేస్ పీరియడ్ టైంని మున్సిపల్ కమిషనర్ పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎస్.జ్యోతిబసు, ఉపాధ్యక్షురాలు టీ తిరుపతమ్మ, జోజవరపు విజయలక్ష్మి, టీ చిన్న, గార్లపాటి లక్ష్మి జైపాల్, ఎన్.నరేంద్ర, బత్తుల బ్రహ్మయ్య, మహేష్, వెంకటప్ప, ప్రసాద్, దుర్గ, సేలం దాస్, సంబులు సెక్షన్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణ పనులు పరిశీలన

బస్టాండ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో నూతనంగా హైవేకు ఆనుకుని నిర్మిస్తున్న బస్టాండ్‌ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ మన నాయకులు సామినేని ఉదయభాను కృషితో జగ్గయ్యపేట ప్రజలు ఎన్నో రోజులుగా హైదరాబాద్, మిగతా ప్రదేశాలకు వెళ్లడానికి హైవేపై బస్టాండ్ లేక ఇబ్బంది పడుతున్నారని ఎపిఎస్ఆర్‌టిసి దృష్టికి తీసుకెళ్లి సుమారు కోటి రూపాయల వ్యయంతో హైవే బస్టాండ్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ హైవే బస్టాండ్‌ను ఈ నెలాఖరులోపు ప్రారంభోత్సవం చేస్తామని దానికి అంగరంగ వైభవంగా బస్టాండ్ ముస్తాబవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్పోర్టేషన్ ఆఫీసర్ వై.దానం, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, డిఇ శివకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షపై అవగాహన

మాట్లాడుతున్న సాంబశివరావు

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో మంగళ వారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలం (బాలికల జూనియర్ కళాశాల) వివేకానంద పాఠ శాలలోని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ పాస్ట్ గవర్నర్ ఎ.కోటిరెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా కెరియర్ గైడెన్స్ కోఆర్డినేటర్ ఎం.సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలి, టెన్త్ తర్వాత ఏ కోర్సులు తీసుకుంటే బాగుంటుందో వివరించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు, సెక్రటరీ చలవాది హరీష్ కుమార్ గుప్తా, ట్రెజరర్ తిమ్మన దినేష్ బాబు, లయన్స్ క్యాబినెట్ మెంబర్ పి రాజారెడ్డి, ఫాస్ట్ ప్రెసిడెంట్ మద్దినేని శ్రీనివాస్ రావు, ప్రభుత్వబాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తిరువూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమ్మెకాలం ఒప్పందాలు అమలుచేయాలని తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ముందు సిఐటియు అధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు బలగాని వెంకటేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 16 రోజులు సమ్మె చేస్తే రాష్ట్ర ప్రభుత్వం సమ్మెకు సంబంధించిన ఒప్పందాలను అమలు చేయకుండా ప్రభుత్వం కాల యాపన చేస్తుందన్నారు. సమ్మె విరమించిన మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు, మంత్రులు ఇంతవరకు సమస్య పరిష్కరించకపోటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం సమ్మెకాలం ఒప్పందాలను వెంటనే అమలు చేయకుంటే కార్మికులు ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్ళే అవకాశం ఉందని ఆయన హెచ్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు చాపలమడుగు నాగరాజు, మారుపోగు నాగరాజు, శ్రీను, బాబురావు, సామ్రాజ్యం, రమణ, నాగభూషి, వేణు కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

8న చలో విజయవాడ జయప్రదం చేయాలి

ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల


ఎ.కొండూరులో మాట్లాడుతున్న కమల

తిరువూరులో నోటీసులిస్తూ...

మైలవరంలో ఆందోళన చేస్తూ...

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని, ఆశలకు సంబంధం లేని పనులు చేయించొద్దని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల డిమాండ్ చేశారు. రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని, సాధారణ సెలవులు, మెడికల్ లీవులు, మెటర్నిటీ లీవులు అమలు చేయాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ 8న జరిగే చలో విజయవాడలో పాల్గొని జయప్రదం చేయాలని ఆశవర్కర్లకు కమల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆశ వర్కర్లపై పనిభారం పెరిగిందని రూ.10వేలు వేతనం ఇస్తున్నారనే పేరుతో 24 గంటలు చాకిరీ చేస్తున్నారన్నారు. సెల్‌ఫోన్లు పనిచేయకపోతే సొంత ఫోన్లు కొని పని చేయాలని, లేకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరింపులు, నిత్యకృత్యం అయ్యాయని, ప్రతిరోజు రిజిస్టర్లో సంతకాలు చేయాలని, హెల్త్ క్లినిక్, సచివాలయాల్లో రోజంతా కూర్చోవాలని, మిగిలిన సమయంలో ఫీల్డ్ వర్క్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం నిబంధనలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆశవర్కర్లు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక ఈ మధ్యకాలంలో అనేకమంది గుండెపోటుతో అకాల మరణానికి గురవుతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఆశ వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో సంక్షేమ పథకాలు కోత పెట్టడం సరికాదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు, ఆశ వర్కర్ సీనియర్ నాయకులు భీమాల లక్ష్మి, వెంకటరమణ, శ్రావణి, దుర్గా, జయ, తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** తమ సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో 8న జరగనున్న ధర్నాకు తరలి వెళ్తున్నట్లు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో ప్రాథమిక వైద్యాధికారులకు నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల, వరలక్ష్మి వజ్రమ్మ ఉష రజిని, ఆశ వర్కర్లు తిరువూరు అర్బన్ పిఎస్‌సి నాయకులు చిట్టెమ్మ సులోచన సంధ్య, భవాని, పుల్లమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** ఆశ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.సుధాకర్ పిలుపునిచ్చారు. ఆశ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండలంలోని చంద్రాల పిహెచ్‌సి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు పని భారం పెరిగిందని, కనీస వేతనం అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.జ్యోతి, యూనియన్ నాయకులు దుర్గ, కళ్యాణి, జయలక్ష్మి, జయ, రమణ, శైలజ పాల్గొన్నారు.

కంటి పరీక్షా పరికరాల వితరణ


కంటి పరీక్షా పరికరాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి - మైలవరం : ఎస్వీఆర్ జిఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్ష రూపాయల విలువ కలిగిన కంటి పరీక్షా పరికరాలను ద్వారకాతిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్.వి.సుధాకర్‌రావు మంగళవారం లైన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేటకు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యాలయంలో ఎస్.వి.సుధాకర్‌రావు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశామని, చేస్తున్నామన్నారు. విస్సన్నపేట లైన్స్ క్లబ్ నిర్వహించే వైద్య శిబిరాలలో కంటి పరీక్షకు సంబంధించిన పరికరాలు లేనందున వాటిని వితరణగా ఇచ్చినట్టు ఆయన తెలిపారు. లైన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఇవి మరింతగా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ ఎస్.వి.ఎన్.నివృతరావు, ఎల్‌సిఐఎఫ్ డిస్టిక్ కో ఆర్డినేటర్ లయన్ ఎన్.టి.వెంకటేశ్వరరావు, డిస్టిక్ క్యాబినెట్ సెక్రటరీ బాబు, మైలవరం లైన్స్ క్లబ్ అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు, సెక్రటరీ చలువాది హరీష్ కుమార్ గుప్తా, ట్రెజరర్ తిమ్మన దినేష్ బాబు, లయన్ ఏరియా కోఆర్డినేటర్ సి హెచ్.బాలగోపాల్ రెడ్డి, డిస్టిక్ క్యాబినెట్ మెంబర్లు పి.రాజారెడ్డి, లేళ్ళ ఏడుకొండలు, మద్దినేని శ్రీనివాసరావు, విస్సన్నపేట క్లబ్ అధ్యక్షులు వేమూరి శ్రీనివాసరావు, సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామయ్య 25వ వర్ధంతి

మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి - వీరులపాడు : మండ లంలోని నరసింహ రావు పాలెం గ్రామంలో పచ్చాల వెంకట్రా మయ్య 25వ వర్ధంతి సంద ర్భంగా పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుమారుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ తండ్రి పుచ్చలపల్లి సుంద్రయ్యతో కలిసి ఎన్నో సేవలు చేశారని, వారి సేవలకు గుర్తుగా పివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్‌లో కూడా సేవ కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. 25వ వర్ధంతి సందర్భంగా పివిఆర్ ట్రస్ట్ తరపున నరసింహారావుపాలెంలో ఆరు క్రికెట్ టీములకు టీ షర్టు క్రికెట్ కిట్లు అందజేశారు. అనంతరం వారి సన్నిహితులకు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీరులపాడు ఎస్ఐ మహాలక్ష్మణుడు ఎంపిటిసి శీలం వెంకటరమణారెడ్డి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు ఉప సర్పంచ్ మాధవరెడ్డి జంపాల శ్రీనివాసరావు నరేష్, మాజీ సర్పంచులు వార్డు మెంబర్లు గ్రామస్తులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న జడ్జి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేదాద్రి శ్రీ యోగా నంద లక్ష్మీనర సింహస్వామి వారిని మచిలీపట్నం లోకాదళ్ కోర్ట్ జడ్జి కె.వి. రామ కృష్ణయ్య మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఇఒ సూచనల మేరకు ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం యోగానంద చార్యులు ఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

'వైసిపిని వీడం'

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ వైసీపీ కేడర్ మొత్తానికి జగనన్న మాటే శిరోధార్యమనికొండపల్లి మున్సి పాలిటీ వైసీపీ చైర్మన్ అభ్యర్థి గుంజ శ్రీనివాసు అన్నారు. ఎవరూ వైసీపీని వీడేది లేదని, విలువలతో కూడిన రాజకీ యాలే తమ లక్ష్యమని పేర్కొ న్నారు. మంగళవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గ సమ న్వయకర్తగా సామాన్యుడైన బిసి సామాజిక వర్గానికి చెందిన జడ్‌పిటిసి సభ్యుడు తిరుపతిరావును గెలిపిస్తామన్నారు.

వైసిపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా సౌమ్య

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వీరమాచినేని సౌమ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని బొజ్జా డెంటల్ హాస్పిటల్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ తనను ప్రోత్సహించి రాష్ట్ర వైసిపి మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

పాఠశాలకు క్రీడా కిట్లు వితరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని ధర్మవరప్పాడు తండా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు పర్చా లక్ష్మణరావు తాను ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులకు రూ.4 వేల విలువచేసే క్రీడా పరికరాలు, రంగు రంగుల బంతులను, ప్రత్యేకంగా విద్యార్థునులకు స్కూల్ యూనిఫాం రంగు రిబ్బన్లు ఎంఇఒ ఎల్.చిట్టిబాబు చేతులు మీదుగా అందజేశారు. ఎంఇఒ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడా వ్యాయామానికి విద్యార్థులకు ఆటవస్తువులు అందించిన పర్చా లక్ష్మణరావును అభినం దించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయిని కసుకుర్తి మంగతాయమ్మ, ఉపాధ్యాయులు టీవీ సుజాత, ఆరోగ్య మేరి, వసంత, పల్లవి, ఉపాధ్యాయులు బాలాజీ, సిఆర్‌పిలు వెంకటేశ్వరరావు, భావన పేరెంట్స్ కమిటీ చైర్మన్ ధారావత్ తావురియ పాల్గొన్నారు.

కుమారిని అభినందిస్తున్న ఉద్యోగులు

జుజ్జూరు ఎండిఒగా కుమారి

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నూతన ఎండి ఒగా కుమారి బాధ్యతల స్వీకరిం చారు. ఎండిఒ కుమారికి కార్యాల యం సిబ్బంది మండల ప్రజా పరి షత్ అధ్య క్షురాలు కోటేరు శ్రీలక్ష్మి ఎంపిటిసిలు తోట నారాయణ సత్యనారాయణ రెడ్డి షేక్ నాగుల్ మీరా మండల కో ఆప్షన్ సభ్యులు జైలుద్దీన్ వైసిపి మాజీ జెడ్పిటిసి కోటేరు ముత్తారెడ్డి మండల కేంద్రంలో సర్పంచి కోటి ఉపసర్పంచి పశువులేటి సాయిబాబు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎండిఒగా బాధ్యతలు కుమారి రేపల్లె నుండి ఎన్నికల బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని నూతన భవనం నిర్మాణానికి జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదన పంపిస్తానని తెలిపారు.

గ్రామాల్లో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - వత్సవాయి : ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించారు. టిడిపి మండల అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు అధ్యక్షతన వత్సవాయి, డబ్బాకుపల్లి, పెంట్యాల వారిగూడెం వివిధ గ్రామాల నాయకుల సమన్వయంలో, పోలంపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు కిలారు విశ్వనాథ్ (చిన్ని), గ్రామ టిడిపి మాజీ అధ్యక్షులు కిలారు సూర్యనారాయణ మాజీ ఎంపిటిసి ఆవుల రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా విజయవాడ పార్లమెంటు ఇన్చార్జి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

గ్రామ వార్డు సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, పంటల ఈకేవైసీ, ధాన్యం సేకరణ, చెరువుల భర్తీ, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవలే కొత్తగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు మారారని, వారి పరిధి ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం జిల్లాలో నవరత్నాలు-పేదలందరికి ఇల్లు పథకం కింద లబ్ధిదారుల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో జరగాల్సి ఉందన్నారు. అయితే కొన్ని చోట్ల డేటా వివరాలు లేనందున ఇంకా మొదలు కాలేదన్నారు. జిల్లాలో 85 వేల మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు 10,700 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. పంటల ఈకేవైసీ

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

పురోగతి 60 శాతం వరకు పూర్తి చేశారని, మరింత పురోగతి సాధించాలన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో చివరి వరకు నీరు అందాల్సి ఉందన్నారు. నీరు వృధా కాకుండా అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపుకోవాలన్నారు.

ఓటర్లకు అవగాహన కల్పించాలి

ఓటర్ల జాబితా తీసుకుని ఇంటింటికి వెళ్లి వారి ఓట్లు ఏ పోలింగ్ కేంద్రంలో ఉన్నాయో తెలియజేసి ఓటర్లకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో పురుషులు 7,37,394, స్త్రీలు 7,80,796, థర్డ్ జెండర్ 65 మొత్తం 15,18,255 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ గత నెల 22వ తేదీ నాటికి పెండింగ్ దరఖాస్తులు, తదుపరి అందిన దరఖాస్తుల వివరాలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేస్తూ, పెండింగ్ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతున్నదన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ఇంకను కొనసాగుతుందని, 18 సంవత్సరాలు నిండి అర్హత కలిగిన వారు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్వో చంద్రశేఖరరావు, వైసిపి, టిడిపి, సిపిఎం, బిజెపి, ఐఎన్సి, బిఎస్పి ప్రతినిధులు షేక్ సిలార్ దాదా, దిలీప్ కుమార్, కొడాలి శర్మ, పంతం గజేంద్ర, కోక ఫణిభూషణ్, ఎస్. బాలాజీ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారి దుర్గా కిషోర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఈ నెల 18న విజయవాడలో జరగనున్న చలో ఒపిఎస్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను యుటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి కనకారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.పూర్ణచంద్రరావు, అవనిగడ్డ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే జీవేంద్రరావు, బి.శివరామకృష్ణ, కొండవీటి అశోక్, వి.బుజ్జిబాబు, నడకుదుటి ఉమామహేశ్వరరావు, వివి గోవిందరావు, టిఎస్ పెరుమాళ్లు, దామోదర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టయిన సర్పంచులకు సంఘీభావం

ప్రజాశక్తి-అవనిగడ్డ: చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన సర్పంచులను అవనిగడ్డ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు చిలకలపూడి పాపారావు తీవ్రంగా

ఖండించారు. మంగళవారం ఆయన పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి అరెస్టుకు గురైన సర్పంచులకు సంఘీభావం తెలిపారు. ఉపాధి హామీ నిధులను చట్ట ప్రకారం పంచాయతీలకు ఇవ్వాలని కోరారు. పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారని, చలో అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకున్నారని, రాష్ట్ర సర్పంచుల సంఘ ప్రతినిధులను మండలంలో అరెస్టు చేసి తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. ఈ సందర్భంగా పాపారావు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రిక్షా కవర్లు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ: శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ శ్యామ్‌కిషోర్‌నాయుడు అవనిగడ్డలోని రిక్షా కార్మికులకు అవసరమైన టాప్ కవర్లను పంపిణీ చేశారు. మంగళవారం సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి సోషల్ వెల్ఫేర్ అధికారి పొట్టి కృష్ణుడు, మునిపల్లి వెంకటేశ్వరరావు, రిక్షా కార్మిక సంఘం నాయకులు

కొక్కిలిగడ్డ ప్రసాద్, క్రైసెపల్లి సాల్మన్, కోతాడ వెంకటేశ్వరరావు, మునవత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'బాలశౌరిని విమర్శించే స్థాయి పేర్నికి లేదు'

ప్రజాశక్తి-అవనిగడ్డ: బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిని విమర్శించే స్థాయి బందరు ఎమ్మెల్యే మాజీమంత్రి పేర్ని నానికి లేదని జనసేన పార్టీ అవనిగడ్డ నియోజకవర్గం నాయకులు గుడివాడ శేషుబాబు విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో శేషుబాబు మీడియాతో మాట్లాడుతూ బాలశౌరిపై పేర్ని నాని విమర్శలను ఖండించారు. కేంద్రం దగ్గర అనుమతులు నిధులు తెచ్చి బాలశౌరి బందరు పోర్టు నిర్మాణానికి కృషి చేస్తుంటే తానే కట్టినట్లు ఫోటోలు దిగడం పేర్ని నానికే చెల్లిందన్నారు. జగన్ వేవ్ ఉన్నప్పుడు మినహా ఏనాడు గెలవని నాని బందరు పట్టణాన్ని ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఎంపీ బాలశౌరి నిధులతో వంతెన మంజూరు చేస్తే ఎంపిని పిలవకుండా అధికారులు ఎమ్మెల్యే షాడో ఎమ్మెల్యేలతో శంకుస్థాపన చేయించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని శేషుబాబు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బొప్పన భాను, ముమ్మారెడ్డి వెంకటకృష్ణారావు, కడవ ప్రభాకర్, కమిలి సాయి భార్గవ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు ఖండన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

గుజరాత్ జూనగఢ్‌లో గత నెల జరిగిన ఒక ధార్మిక ప్రసంగంలో ముంబాయికి చెందిన ప్రముఖ ధార్మిక వక్త ముఫ్తీ సల్మాన్ అజహరీ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ చేసిన వ్యాఖ్యలను కొందరు ఇస్లాం ఫోబియాగ్రస్తులు ఆ వ్యాఖ్యలను వక్రీకరించి అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని కృష్ణాజిల్లా మచిలీపట్నం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ, ముస్లిం ఐక్యవేదిక మరియు తదితర ముస్లిం సంఘాలు ఖండించాయి. మంగళవారం ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో స్థానిక రాజుపేట షాదీఖానాలో విలేకరులతో వారు మాట్లాడుతూ అజహరీ అమెరికా వంటి దేశాల దౌర్జన్యాన్ని ఖండించారన్నారు. భారతదేశాన్ని గానీ, దేశం లో వున్న హిందువులను గానీ విమర్శించలేదన్నారు. అధికారంలో ఉన్న బిజెపి గుజరాత్‌కు చెందిన ఎటిఎస్ ద్వారా అన్యాయంగా అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అహ్లెసున్నత్, షియా, అహ్లెహదీస్, తబ్లీగ్ జమాత్ జమాతె ఇస్లాం ఉల్మా మౌలానా జైనుల్ ఆబిదీన్, మౌలానా అబ్దుల్ కరీం, మౌలానా రాషిద్ మౌలానా సమీ మౌలానా షాహిద్ , షేక్ అచ్చుభా పాల్గొన్నారు.

ఆరు మండలాలకు కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-అవనిగడ్డ: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులను నియమిస్తూ డిసిసి అధ్యక్షులు వింత సంజీవరెడ్డి మంగళవారం బందరు పార్టీ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేసినట్లు నియోజకవర్గ ఇన్చార్జ్ అందె శ్రీరామ్ మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షులు నియోజకవర్గం ప్రకటిస్తూ అందుకు సంబంధించిన నియామక పత్రాలు అందజేశారన్నారు. అవనిగడ్డ మండల అధ్యక్షులుగా దిడ్ల వీర రాఘవులు. మోపిదేవి కోసూరి రామాంజనేయులు, చల్లపల్లి పిల్లి కవిత, ఘంటసాల మునిపల్లి మోహన్‌రావు, నాగాయలంక భీమా శ్రీనివాసరావు, కోడూరు ముత్తురెడ్డి వెంకటేశ్వరరావులను నియమించగా జిల్లా ఉపాధ్యక్షులుగా గొల్ల వెంకట సుబ్బారావు, కార్యదర్శిగా



కాగితాల సుదర్శన్ రావు, జాయింట్ సెక్రటరీగా ఎస్ కే గౌస్, కార్యదర్శిగా నరహరిశెట్టి లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీగా జరుగు నాగరాజ్యం, కార్యదర్శిగా తోట గోవిందులను నియమించినట్లు శ్రీరామ్ మూర్తి తెలిపారు.

విద్యా వ్యవస్థలో మార్పులు అవసరం : స్నిగ్ధ

ప్రజాశక్తి-ఉయ్యూరు: విద్యావవస్థలో వస్తున్న మార్పుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి వారిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు కృషి చేయాలని రక్షఫౌండేషన్ డైరెక్టర్ పడమట స్నిగ్ధ అన్నారు. ఆకునూరు ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించి పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులకు ఐబీ కర్నులం విద్య రానున్న విద్యాసంవత్సరం నుంచి అమలు చేసేం దుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. ఈవిధానం ర్యాంకులు పేరుతో బట్టీ పట్టించే విద్యనుంచి విముక్తి పొందేందుకు ఎంతో దోహద పడుతుం దన్నారు. సులభతరమైన సాంకేతిక విద్య సాంకేతిక పరంగా అందించేందుకు ఐబి కర్నులం విద్య ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదన్నారు. విద్యావ్యవస్థలో విప్ల వాత్మకమైన మార్పులతో విద్యార్థులను పేదరికం నుంచి విముక్తి కల్పించడంతో పాటు దేశానికి పేరుతెచ్చేలా తీర్చిదిద్దిన వారమవుతామని అభిప్రాయం వ్యక్తం చేశారు.

మెగా డిఎస్‌సి కోరుతూ దీక్ష

ప్రజాశక్తి-అవనిగడ్డ: డిఎస్సి అభ్యర్థులకు టిడిపి, జనసేన పార్టీలు అండగా ఉంటాయని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ హామీ ఇచ్చారు. మెగా డిఎస్సి కోరుతూ మంగళవారం గాంధీ క్షేత్రంలో డీఎస్సీ నిరుద్యోగులు ఏర్పాటు చేసిన ఒక్కరోజు రిలే దీక్షలో బుద్ధప్రసాద్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో తాను అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తానని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి ఐదేళ్లయిన ఒక్కసారి కూడా ఉపాధ్యాయ నియామక ఉత్తర్వులు ఇచ్చింది లేదన్నారు. నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధి పేరుతో డబ్బులు దోచుకొని అనంతరం అభివృద్ధి చేసిన పాఠశాలలను 117 జీవో తీసుకొచ్చి మూయించేసారన్నారు. పాఠశాలలే లేకపోతే ఉపాధ్యాయ నియామకాలు ఎలా చేపడతారని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ అంటే ఏమిటో తెలియని వారు మంత్రులుగా ప్రభుత్వ సలహాదారులుగా ఉన్నారని విమర్శించారు. కృష్ణాజిల్లా తెలుగు యువత అధ్యక్షులు దండమూడి చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, టిడిపి

మాట్లాడుతున్న మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్

జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రాం, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు యాసం చిట్టిబాబు, జనసేన మండల అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, మెండు లక్ష్మణరావు, బండే కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్లో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - తిరువూరు : ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోటిరెడ్డి తెలిపారు. ఐదో తరగతిలో మొత్తం 80 సీట్లు (బాలురకు), ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపికలో 40, సీట్లు బైపిసిలో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రిజర్వేషన్ అమలు పద్ధతిలో సీట్ల భర్తీ చేయటం జరుగుతుందని, ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తిగా అన్‌లైన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ఐదో తరగతి విద్యార్థులకు మార్చి 10న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 వరకు ప్రవేశ పరీక్ష ఇంగ్లీషులో నిర్వహించబడుతుందన్నారు. వివరాలకు 9949356326 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు.

పాలు, పండ్లు అందజేసిన దృశ్యం

పండ్లు, దుప్పట్లు పంపిణీ

విజయవాడ : కష్ణలంక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణలంకలో గల నిర్మల శిశు భవన్‌లో పిల్లలకు పాలు, పండ్లు, దుప్పట్లు, డైపర్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ కోశాధికారి అందుగల రాజ్ కుమార్, అందుగల రమేష్ తండ్రి అందుగల సుబ్బారావు జ్ఞాపకార్థం మంగళవారం పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణలంక వాకర్స్ అధ్యక్షులు మూరం లక్ష్మయ్య. ప్రధానకార్యదర్శి సయ్యపురెడ్డి రాజా, గౌరవ అధ్యక్షులు నిమ్మల దుర్గ రావు, ఉప అధ్యక్షులు వడ్లమూడి సుబ్బా రావు, ఉప కోశాధికారి మిరియాల వెంకటేశ్వరరావు, ప్యానల్ సభ్యులతో పాటు కష్ణలంక నిర్మల శిశు భవన్ సిస్టర్స్ కూడా పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్

జగ్గయ్యపేట : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని రైతు, కార్మిక, ప్రజా అనుకూల విధానాలకై పోరాడాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదికల పిలుపుమేరకు ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని డివిఆర్ నగర్‌లో మంగళవారం రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నాయకులు కాకనబోయిన లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, కోట కృష్ణ, దాసరి నాగేశ్వరరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ప్రపంచ కుబేరుల జాబితాలో అదాని, అంబానీలు చేరగా పేద రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఒక లక్ష 50 వేల మంది బాలవర్మరణం పాలయ్యారన్నారు. సాగులో ఉన్న కౌలు రైతులకే నష్టపరిహారం, బీమా సౌకర్యం ఇవ్వాలని తదితరుల డిమాండ్లతో ఈ సమ్మె చేస్తున్నామని తెలిపారు.

సౌకర్యాల కల్పనకు నాంది : దుర్గగుడి ఛైర్మన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పడి నేటితో ఏడాది కాలం పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా దేవస్థానానికి వచ్చే యాత్రికులకు పలు సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టినట్లు ఆలయ ఛైర్మన్ కర్నాటి రాంబాబు మంగళవారం తెలిపారు. సంవత్సరం గడుస్తున్న సందర్బంగా ఆలయ ఛైర్మన్ కర్నాటి రాంబాబు ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డు ద్వారా భక్తుల సౌకర్యార్థం పలు అజెండాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దేవస్థానంలో రాత్రి పూట భోజనం, అమ్మవారి దర్శనానంతరం కుంకుమ ప్రసాదం వితరణ, పాదుకలు, శఠగోపం, నూతన వధువు వరులకు ఉచితంగా అంతరాలయ దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు, భక్తులకు దుర్గా ఘాట్‌లో కృష్ణా నదిలో స్నానాలకు అనుమతి (జల్లు స్నానం కాకుండా) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంద్రకీలాద్రిపై పొంగలి షెడ్డు నిర్మాణం, అందుబాటులో ఉంచడం, ఉచిత బస్సులు - కొండపై నుండి దుర్గా ఘాట్ వరకు దుర్గా ఘాట్ నుండి కొండపైకి, దివ్యాంగులకు వీల్ ఛైర్‌లు ఏర్పాటు, అన్నదాన భవనం నిర్మాణం, ప్రసాదం పోటు నిర్మాణం, ఎలివేటేడ్ క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు, రాతియాగశాల నిర్మాణ పనుల శంకుస్థాపన చేశామన్నారు.

రాధానగర్ సెవెన్ అపార్ట్‌మెంట్లో

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ధర్నా చేస్తున్న స్థానికులు, హాజరైన బాబూరావు

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ : పాయికాపురం రాధానగర్ సెవెన్ అపార్ట్‌మెంట్‌లోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానికులు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అపార్ట్‌మెంట్‌లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తాగునీరు లేవని, కనీసం వాడుకునేందుకు బోరు నీటి సౌకర్యం కూడా సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ వ్యవస్థ లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అపార్ట్‌మెంట్‌లలో నీటి పైపులు పగిలిపోయి చాలాచోట్ల నీరు వృథాగా పోతుందని, పైపులకు మరమ్మతులు చేయించి ఆ సమస్యను అరికట్టాలని డిమాండ్ చేశారు. పైపులు పగిలిపోవడం వల్ల తాగునీరు సైతం కలుషితమవుతోందని, దీనివల్ల అపార్ట్‌మెంట్ వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ లేక కాలనీ అంతా దుర్వాసన వస్తోందన్నారు. అపార్ట్‌మెంట్‌ల రిజిస్ట్రేషన్ కోసం రూ.60 వేలకు పైగా వసూలు చేశారని కానీ వసతులు సరిగా లేవని పైగా చెత్తపన్ను, నీటి పన్ను వేస్తున్నారని, కరెంటు బిల్లులు సైతం అధికరంగా వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 10 సంవత్సరాలుగా పట్టాలివ్వాలని అపార్ట్‌మెంట్లు వాసులకు పన్నుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అపార్ట్‌మెంట్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటర్ ట్యాంకులు పగిలిపోయి ఉన్నాయని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే త్వరలో రాజీవ్ నగర్ కండ్రిక రాజరాజేశ్వరిపేట సింగ్‌నగర్ కాలనీవాసులతో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సిటీ కార్యదర్శి బి.రామారావు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీదేవి, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణ, డివైఎఫ్ఐ 63వ డివిజన్ కార్యదర్శి ఎమ్‌డి రఫీ, సిపిఎం నాయకులు నాగేశ్వరావు నాగరాజు జి.అరుణ వెంకటమ్మ సత్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. డివిజన్ ఇంచార్జ్ యన్.నాగేశ్వరరావు, డివిజన్ పార్టీ సభ్యులు యం.రామాంజనేయులు, పి.సాంబిరెడ్డి, జె.నాగరాజు, యండి.రఫీ, యండి.అక్బర్, టి.నాగరాజు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యలు

కాలవల్లో చెత్త పేరుకుపోవడంతో విపరీతంగా దోమలు పెరిగిపోయాయని, వాటి నివారణకు చర్యలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అపార్ట్‌మెంట్ పైన ఉన్న ట్యాంకు నుండి వచ్చే పైపులు పగిలిపోవడంతో మెట్లనిండా నీరు చేరి అపార్ట్‌మెంట్ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అపార్ట్మెంట్ పైన ఉన్న ట్యాంకు నుంచి వచ్చే పైపులు పగిలిపోవడంతో మెట్ల నిండా నీరు పారి అపార్ట్మెంట్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన పైపులను, వాటర్ ట్యాంకులను బాగు చేయాలి. ఇళ్లకు తలుపులు ఊడిపోయి బిల్డింగ్ మొత్తం పగుళ్ళు ఏర్పడి పెచ్చులు ఊడుతున్నాయి.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ పరీక్ష

టెన్త్ మోడల్ పేపర్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రానున్న టెన్త్ పరీక్షల దృష్ట్యా (ఎస్ఎఫ్ఐ), యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో జరుగుతున్న ప్రజ్ఞ వికాసం పదో తరగతి మోడల్ పరీక్షలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు అన్నారు. మంగళవారం కొత్తపేటలోని కె.బి.యన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.నారాయణరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు, బి.మాధవ్ చేతుల మీదుగా మోడల్ టెన్త్ ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పరీక్షకు విద్యార్థుల వద్ద నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. భవిష్యత్తులో రాయబోయే అనేక పోటీ పరీక్షలకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి మోడల్ పరీక్ష దోహదపడుతుందని విద్యార్థులు చాలా సంతోషం వ్యక్తంచేశారని చెప్పారు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి టాలెంట్ టెస్ట్‌లు విద్యార్థులుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు బి.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఒఐలో అరుదైన చికిత్స

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : అరుదైన గర్భాశయ కేన్సర్‌కు అమెరికన్ ఆంకాలజీ ఇనిఇస్టట్యూట్‌లో (ఎఒఐ) విజయ వంతంగా చికిత్స నిర్వహించినట్లు హాస్పటల్ వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ కళ్యాణ్ తెలిపారు. నగరంలోని హాస్పటల్ కాన్ఫరెన్స్‌హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భాశయ కేన్సర్‌లలో అతి అరుదుగా, అంటే కేవలం ఐదు శాతం కంటే తక్కువ మాత్రమే కనిపించే ప్రాణాంతకమైన గర్భాశయ లియోమయోసార్కోమా కేసుకు విజయవంతంగా చికిత్స అందించినట్లు తెలిపారు. పొత్తి కడుపు పెరగడం, నెల నుండి నొప్పి సమస్యలతో 47 ఏళ్ల మహిళ తమ హాస్పటల్‌కు వచ్చినట్లు తెలిపారు. ఆమెకు పరీక్షలు నిర్వహించిన అనంతరం ఎంఆర్ఐ పరీక్షలో గర్భాశయంలో పెద్ద కణితి ఉన్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. ల్యూకో సైటోసిస్, హైపో అల్బు మినిమియా, రక్తహీనత, ఎలక్ట్రోలైట్ సరిగా లేకపోవడంతో పాటు అంతకుముందు ఆమెకు హెమిఆర్థోప్లస్టి జరగడం వంటి కారణాలన పరిగణలోకి తీసుకుని చికిత్సను ప్రారం భించినట్లు తెలిపారు. చికిత్స అనంతరం ప్రస్తుతం పూర్తి స్థాయిలో కోలుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో హాస్పటల్ రీజనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా హేమమాలిని

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మున్సిపల్ కమిషనర్‌గా హేమమాలిని ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇన్చార్జి కమీషనర్‌గా ఉన్న మున్సిపల్ ఎఇ ఫణి శ్రీనివాస్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. హేమామాలినికి మున్సి పల్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆదాయ గణన సేవలు



ప్రజాశక్తి - నందిగామ : యుటిఎఫ్ నందిగామ ప్రాంతీయ కార్యాలయం రైతు పేట కంచల సుబ్బారావు భవన్‌లో ఉపాధ్యాయులకు ఇన్‌కంట్యాక్స్ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ట్యాక్స్ రిటర్న్ అవసరమైన ఉపాధ్యాయులు ఆదాయ సమాచారంతో సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు సేవలను పొందొచ్చని నాయకులు ఎం.వి.ఎస్ఎన్ బెనర్జీ, చిన్నం నరసింహారావు, బొద్దుకోళ్ల రమణయ్య, బి.శ్రీనివాస నాయక్, వెంకటాద్రి మంగళవారం తెలిపారు.

ఆసిఫ్‌కు సత్కారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్‌ను మంగళవారం పాత శివాలయం బోర్డు ఛైర్మన్ బొమ్ము మధు ఆధ్వర్యంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు, పురోహితులు సత్కరించారు. ఆసిఫ్‌కు అభినందనలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం వైసిపి నాయకులు మండల శీను, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : మండల పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో 7వ తేదీ నుండి 17వ తేదీ వరకు ఓటర్లకు ఇవిఎంలు, వి.వి ప్యాడ్‌లపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ అమ్మాజీ తెలిపారు. ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని మంగళవారం ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవాలయంలో ప్రతిరోజూ జరిగే నిత్యాన్నదానం పథకానికి బుచ్చిరాజు పాలెం, విశాఖపట్నంకు చెందిన బండి కిషోర్ కుమార్, కుటుంబ సభ్యులు రూ.2.50 లక్షలు చెక్కును విరాళంగా ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబును మంగళవారం కలిసి అందజేశారు. దాతకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి వేదాశీర్వచనం కల్పించగా ఆలయ ఛైర్మన్ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

ఇబ్రహీంపట్నం తహశీల్దార్‌గా రాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం నూతన తహశీల్దార్‌గా బి.ఎస్. వి.ఎస్. ఆర్.ఎల్ .రాజు మంగళ వారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన ఏలూరు జిల్లా నిడమర్రు నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు కాకినాడ జిల్లా రౌతులపూడికి బదిలీ అయ్యారు. నూతన తహశీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఒప్పందాలు అమలు చేయకపోతే సమ్మెబాట

ప్రజాశక్తి - నందిగామ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా పిలుపులో భాగంగా నందిగామ మున్సిపల్ ఆఫీస్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 16 రోజులు సమ్మె చేస్తే రాష్ట్ర ప్రభుత్వం సమ్మెకు సంబంధించినటువంటి ఒప్పందాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ హేమమాలినికి అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సలికేటి నరేష్, దసవరపు సైదా, నాగరాజు, మాణిక్యం, బేబీ, రుత్తమ్మ, సంతీష్, జయరాజు, పిచ్చియ్య, తదితరులు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపు

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటుకరించడం, అటవీ సంపద, గనులు అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలను వెనక్కు తీసుకున్నట్లే తీసుకుని దొడ్డిదారిన అమలు చేస్తుందన్నారు. తెలుగు రైతు కృష్ణా జిల్లా అధ్యక్షులు గోపు సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి నష్టదాయకమైన నల్ల చట్టాలను రద్దు చేయాలని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా నాయకులు లింగం పిలిఫ్ మాట్లాడుతూ కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వకపోగా తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టిందన్నారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రంగారావు, ఎఫ్‌టియు న్యూ జిల్లా నాయకులు బి వెంకటరామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి పవన్ కుమార్, సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి జ్యోతి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఏ. ఏడుకొండలు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కే శర్మ, సిఐటియు మచిలీపట్నం కార్యదర్శి సిహెచ్.జయరావు, ఎఐటియుసి పట్టణ నాయకులు ఓ.ఎల్.రావు, రైతు సంఘం నాయకులు ఈడే రామారావు, బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు ఎండి యూనస్ పాల్గొన్నారు.

విభజన హామీలు తుంగలో తొక్కారు : సంజీవరెడ్డి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభజన హామీలను తుంగలో తొక్కాయని కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వింత సంజీవరెడ్డి విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలవరం నిర్మాణం, అమరావతి రాజధాని, కడప ఉక్కు, విశాఖ ఉక్కు పరిశ్రమలను కాపాడుకోవడం, రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్యాకేజీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తేనే జరుగుతాయన్నారు. అనంతరం 95 మందితో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ అందే శ్రీ రామమూర్తి, పెడన లింగాల సుధాకర్ రావు, గుడివాడ శిష్టా దత్తుడు, కోక ఫణిభూషణ్, గణేష్ బాబు, ఏరువా ప్రసాద్ రెడ్డి, వెలిసిన సుబ్రహ్మణ్యం, కిలారు వెంకటరత్నం, నల్లబోలు కుమారి, రజియా సుల్తానా, చంద్రశేఖర్, చిలుకోటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికుల వినతి

పెనమలూరు: పెండింగ్లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైయస్సార్ తాడిగడప కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావును మంగళవారం కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు. 2024 సంక్రాంతి పండగ సందర్భంగా మనిషికి వెయ్యి రూపాయలు పండగ బోనస్ ఇస్తామని ప్రభుత్వం జీవో ఇచ్చిందని, అలాగే కార్మికులకు ఇవ్వాల్సిన బట్టలు, .సబ్బులు, చెప్పులు, ఐడెంటి కార్డులు ఇవ్వాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వెంటనే పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, యలమల సరళ, చొప్పర రత్న కరుణ, వెంకటరెడ్డి, కంచర్ల పద్మ, బుజ్జులు, కంచర్ల కృష్ణ, పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌కు అభినందనలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఎపి రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షునిగా, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్‌గా ఉన్న తోట సతీష్ కృష్ణాజిల్లా పౌరసరఫరాల శాఖ సంస్థ జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కృష్ణాజిల్లా శాఖ తరుపున కార్యవర్గ సభ్యులు మంగళవారం సతీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పేపేటి సత్యనారాయణ, జిల్లా ట్రెజరర్ వై. శివశంకర్, పామర్తి శ్రీనివాస్, అక్బర్ ఖాన్, గౌతమ్, ఎండి బేగ్, టి.శేఖర్, జి.శ్యామ్, రాజేష్, కృష్ణమూర్తి, తేజ, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి ఎస్ఐగా రాజు బాధ్యతలు

ప్రజాశక్తి-పెదపారుపూడి: పెదపారుపూడి ఎస్ఐగా జి.రాజు బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలో భాగంగా పెదపారుపూడి ఎస్సైగా పనిచేస్తున్న నాగ కళ్యాణి కాకినాడకు బదిలీ కాగా ఉంగుటూరు పిఎస్‌లో పనిచేస్తున్న ఎస్ఐ రాజు పెదపారుపూడి స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలన్నారు. మండలంలో పేకాట. కోడిపందాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలకు పతకాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ జెఎన్‌టియుకె కాకినాడ నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో పలు బహుమతులు సాధించి ట్రోఫీను కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. జనవరి - ఫిబ్రవరి లో లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ వేదికగా జెఎన్‌టియుకె కాకినాడ నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొని, పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీలో ద్వితీయ స్థానం, సారధి ఇంజనీరింగ్ కాలేజీ వేదికగా నిర్వహించిన మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలో ప్రథమ స్థానం, పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీలో తతీయ స్థానం పొందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ, వడ్లమూడి నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడలలో మహిళల వాలీబాల్ జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని ట్రోఫీ మరియు 15వేల నగదు బహుమతి ని పొందారని, అథ్లెటిక్స్ పోటీలలో షాట్ పుట్ లో బంగారు పతకం, 800 మీటర్లు, మరియు 400 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకాలను సాధించి కళాశాల ఖ్యాతిని మరింత ఇనుమడింప జేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను, ఫిజికల్ డైరెక్టర్స్ ఎం.శివ శంకర్, జి. వెంకటేష్, డి.పూజిత లను యాజమాన్య సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, ఎం.ఆర్.సి.హెచ్. శాస్త్రి, డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి. ప్రసాద్, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి.రవీంద్రబాబు అభినందనలు తెలిపారు.

‘రైతే రాజు’ నాటికలోని ఓ సన్నివేశం

వక్కలగడ్డలో కళాకారుల సంస్మరణ సభ

ప్రజాశక్తి-చల్లపల్లి: వక్కలగడ్డకు పూర్వ వైభవం సంతరించుకుందని ప్రజా నాట్యమండలి హైదరాబాద్ నాయకులు హనుమానుల జగన్‌మోహన్‌రావు అన్నారు. సిపిఐ నాయకులు రావి బాబూరావు, అడ్డాడ దుర్గానాగేశ్వరరావు, గ్రామానికి చెందిన పలువురు ప్రజా నాట్యమండలి కళాకారుల సంస్మరణ సభ వక్కలగడ్డ గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మోహనరావు సారధ్యంలో 'రైతే రాజు' అనే నాటికను ప్రదర్శించారు. నాటకాన్ని తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దాసరి గోవిందరావు ఏకపాత్రాభినయంతో నటించిన అల్లూరి సీతారామరాజు పాత్ర ఆహుతులను ఆకట్టుకుంది. ప్రముఖ రంగస్థల నటుడు, ఆర్టీసీ ఉద్యోగి బోలెం రామారావు కమ్యూనిస్టు పార్టీ పాటలపై చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడుతూ నాటక రంగం అంతరించిపోతున్న నేటి తరుణంలో వక్కలగడ్డలో 'రైతే రాజు' నాటక ప్రదర్శనతో వక్కలగడ్డ గ్రామానికి పూర్వ వైభవం సంతరించుకుందన్నారు.

బాధిత కుటుంబాలకు నాని పరామర్శ

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ బస్టాండ్ సెంటర్లో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మతి పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. సోమవారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎమ్మెల్యే కొడాలి నాని పరామర్శించి, ఒక్కో కుటుంబానికి 50 వేల చొప్పున, లక్షన్నర రూపాయలను తక్షణ సహాయంగా అందజేశారు. సియంఓఓ అధికారులతో ఫోన్లో మాట్లాడి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, నందివాడ ఎంపిపి పేయ్యల ఆదాం, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

లింగవరంలో రాము పర్యటన

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ టిడిపి ఇంచార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో మంగళవారం రూరల్ మండలం లింగవరం కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ), జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలసి వెనిగండ్ల రాము లింగవరంలో ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, మాజీ సర్పంచ్ మలిరెడ్డి నర్సారెడ్డి, నాయకులు గంటా బాలాజీ, వసంతవాడ దుర్గారావు పాల్గొన్నారు.

ఆంజనేయులు వర్ధంతి

ప్రజాశక్తి-గుడివాడ: ఆంజనేయులు చేసిన రాజకీయ పోరాటాలు ఎంతో మంది యువతకు అదర్శం కావలని టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం జరిగిన ఆంజనేయులు పదో వర్ధంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్ననేని పూర్ణవీరయ్య(బాబ్జీలు), జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలసి వెనిగండ్ల రాము పాల్గొని అంజేయులు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా అయన చేసిన పలు కార్యక్రమలు వివారించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గోకరకొండ బలరాం, సానా భోగేశ్వరరావు, వసంతవాడ దుర్గారావు, టిడిపి నాయకులు పంద్రాజు సాంబశివరావు, సుంకర గాంధీ, దారపు రెడ్డి మణిశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో విఎంసి కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం తన చాంబర్లో రాజకీయ పార్టీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీలు తమ తమ సమస్యలను ఆయనకు వివరించారు.ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, వచ్చిన ఫారం 6, ఫారం 7, ఫారం 8 దరఖాస్తుల గురించి అభ్యర్థులకు కమిషనర్ వివరించారు.

మీడియాపై దాడి చేసిని టిడిపి నేతలపై చర్యలు తీసుకోవాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి - విజయవాడ : చింతలపూడిలో జరిగిన తెలుగుదేశం పార్టీ రా కదలిరా సభ ఏర్పాట్లు చేస్తున్న సందర్భంగా ఆ పార్టీ మాజీ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్‌రావు, ఆయన అనుచరులు మీడియాపై చేసిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగానికి వారు విజ్ఞప్తి చేశారు. చింతలపూడిలో జరుగుతున్న రా కదలిరా సభ కవరేజీకి వెళ్లిన సీనియర్ జర్నలిస్టులు రమణారావు, శంకర్రావులపై చింతమనేని ప్రభాకర్ రావు, ఆయన అనుచరులు దాడి చేసి దుర్భాషలాడారని, వారి కెమేరాలను లాక్కున్నారని, విలేకరులమని చెప్పినా ఎంత మాత్రం ఖాతరు చేయకపోగా తీవ్రంగా దుర్భాషలాడారని వారు పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నదిపై వంతెనలకు నిధులు వచ్చేనా?

స్లూయిస్‌లకు రూ. 3044.50 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు తయారుచేసి పరిపాలనా ఆమోదం కోసం పంపారు. ఈ బడ్జెట్లోనైనా నిధులు కేటాయిస్తే దిగువ ప్రాంతం రైతాంగానికి సాగునీటి సమస్యతో పాటు ఆ ప్రాంత ప్రజలకు మంచినీటి సౌకర్యం కూడా కలుగుతుంది. అదే సమయంలో పర్యాటకంగా అభివద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది. మినీ బ్యారేజీలకు ఈ బడ్జెట్లోనైనా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. డ్రైనేజీల్లో గుర్రపు డెక్క, తూడు కాడ నిండిపోవడంతో నీటి ప్రవాహానికి అవరోధంగా ఉంటోంది. వర్షాల సమయంలో డ్రైనేజీల్లో సక్రమంగా నీరుపారకపోవడంతో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. కొన్నిచోట్ల డ్రైనేజీలు, పంట కాల్వల గట్లు ఆక్రమణలకు గురికావడంతో అవి కుచించుకుపోతున్నాయి. కాల్వల గట్లు బలహీనంగా ఉండటంతో సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేయలేకపోతున్నారు. ఎక్కడ గండ్లు పడతాయోనని నామమాత్రంగానే నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు కోట్లాది రూపాయల మేర ఆర్థికంగా నష్టపోతున్నారు. ఖరీఫ్ ధాన్యం నిల్వలు రైతుల వద్ద మూడు లక్షల టన్నులకుపైబడి ఉన్నాయి. ఆ ధాన్యం ఎప్పుడు ఆన్‌లైన్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన డెల్టా ఆధునీకరణ పనులు నాలుగేళ్లుగా ముందుకు సాగడం లేదు. జిల్లాలో అసంపూర్తిగా మిగిలిన పనులు, డ్రైనేజీల ఆధునికీకరణ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. డెల్టా ఆధునీకరణ పనులు చేపట్టడానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలి. భారీ వర్షాలు, తుపానులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. రహదారుల అభివద్ధికి సంబంధించి జిల్లాకు పెద్దఎత్తున నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. అపరిష్కతంగా ఉన్న కొల్లేరు అభివద్ధి సమస్యలకు పరిష్కారం చూపాల్సి ఉంది. కొల్లేరు నుంచి వరద నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి కలుస్తోంది. దీని సంబంధించి మూడు రెగ్యులేటర్లు నిర్మించాలని మూడు జిల్లాల రైతాంగం ఎంతోకాలం నుంచి డిమాండ్ చేస్తోంది. ఈ రెగ్యులేటర్ల నిర్మాణానికి సంబంధించి డిపిఆర్ సిద్ధమై నిధుల కోసం ఆర్థిక శాఖ వద్ద ఫైల్ పెండింగ్లో ఉంది. ఈ బడ్జెట్లోనైనా నిధులు కేటాయించాలని ఆ ప్రాంత రైతాంగం డిమాండ్ చేస్తోంది. విజయవాడ నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా బుడమేరుపై పలు వంతెనల నిర్మాణానికి రూ.30.90 కోట్లతో అంచనాల రూపొందించారు. విజయవాడ నగరంలో కూడా కాల్వలపై ఉన్న పాత వంతెనల అభివృద్ధితోపాటు కొత్త వంతెనల నిర్మాణానికి బడ్జెట్లో నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

కుమార్తెపై అత్యాచారం కేసులో తండ్రికి జీవితఖైదు

అనంతరం నిందితుడిపై నేరం రుజువుకావడంతో మంగళవారం న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజిని జీవితకాల జైలు శిక్ష విధించారు. జరిమానాగా రూ.50 వేలు విధించారు. ఆ మొత్తాన్ని బాలికకు చెందేవిధంగా, బాధిత బాలికకు రూ.5 లక్షలు నష్టపరిహారం వచ్చేవిధంగా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ వారిని ఆదేశించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ గుజ్జుల నాగి రెడ్డి, దిశ ఎసిపి వి.వి.నాయుడు, సిఎంఎస్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పర్యవేక్షణలో 16 మంది సాక్షులను విచారించారు.

ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. వచ్చే ఎన్నికలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను (ఈవిఎంల) భద్రపరచడానికి స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం మంగళవారం ఇబ్రహీంపట్నం నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలను కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పరిశీలించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించి ఈవీయం, వీవీఫ్యాట్స్, కంట్రోల్ యూనిట్లను భద్రపరిచేందుకు వీలుగా స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కు అనువుగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట డిఆర్ఓ వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డిఒ బిహెచ్ భవానీ శంకర్, తహశీల్దార్ బిఎస్వీఎస్ఆర్ఎల్ రాజు ఉన్నారు.

సూచలనలిస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

త్వరలో నా రాజకీయ నిర్ణయం చెబుతా : వసంత

ప్రజాశక్తి - నందిగామ : తన స్వగ్రామమైన నందిగామ మండలంలోని ఐతవరం గ్రామంలో మైలవరం వైసిపి ఎంఎల్ఎ వసంత కృష్ణప్రసాద్ మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో తాను ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఇసుక విధానంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. అమ్మఒడి, చేయూత ద్వారా ప్రజలకు వచ్చేదేమీ ఉండదని, ప్రజలు ఉద్యోగాలు అడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలిసి తమ బాధలు చెప్పుకునే పరిస్థితిలేదన్నారు.మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తనపై చేసిన విమర్శలకు కాలమే సమాధానం చెబుతుందన్నారు.

పోలీసులపై హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

ప్రజాశక్తి - విజయవాడ : విధినిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగిస్తూ, గాయపరిచి, హత్యాయత్నం చేసిన కేసులోని నిందితునికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్లో నమోదైన క్రైం.నెం.134/2018 సెక్షన్ 332, 307 ఐపిసి కేసులో నిందితుడైన విజయవాడ భానునగర్‌కు చెందిన సింగరాతి ఏబేలు అలియాస్ హెబేలుపై నేరం రుజువుకావడంతో 12వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి పి.భాస్కర రావు మంగళవారం నిందితునికి మూడేళ్ల జైలు శిక్ష విధించారు. 2018 మార్చి13న కొత్తవంతెన బోస్ బొమ్మ సెంటర్ వద్ద బడ్డీకొట్టును పగలగొట్టేందుకు ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై ఎకెటిపిఎం స్కూల్ వైపుగా పారిపోతున్నారని కంట్రోలు రూమ్ నుండి వైర్లెస్ మెసేజ్ వచ్చింది. ఈ సమయంలో సత్యనారాయనపురం ఏరియా బీట్లో ఉన్న ఓ పోలీస్ కానిస్టేబుల్, హోంగార్డుకు ఆ ముగ్గురు తారసపడ్డారు. వారిని పట్టుకోవడానికి ప్రయత్నించిన సమయంలో మోటార్ సైకిల్ పైనుండి దూకి చీకట్లో పారిపోతుండగా పట్టుకునేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచారు. హోంగార్డుపై రాయి విసరడంతో గాయమైంది. వెంటనే సదరు పోలీసులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాధిత కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుపై సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అదే ఏడాది ఏప్రిల్ 7న నిందితుడైన హెబేలను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి విచారించి జైలు శిక్ష విధించారు. ఈకేసులో ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.బాస్కర్ రావు, సిఎంఎస్ ఇన్‌స్పెక్టర్, అప్పటి సత్యనారాయణ పురం ఎస్ఐ ఎస్.ఫ్రాన్సిస్, ఎం.అశోక్, సిఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో 10 మంది సాక్షులను విచారించారు.

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్. నెం. 471/2021

బిట్వీన్ :
జరుగు నాగ శ్రీనివాసరావు .... వాది
మరియు
జరుగు వెంకటేశ్వరరావు అండ్ అదర్స్ ... ప్రతివాది

టు :
1వ ప్రతివాది : జరుగు వెంకటేశ్వరరావు S/o (లేటు) నిరంజనరావు, హనుమాన్‌శాస్త్రి గారి వీధి, గోద్రేజ్ బిల్డింగ్ ప్రక్కన, మారుతీనగర్, విజయవాడ.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం ది. 28-02-2024నకు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేదా ప్లీడరుగారి ద్వారా గానీ పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 28-2-2024

పరసా మధుసూదనరావు,
మచిలీపట్నం, **వాది తరపు న్యాయవాది,**
ది.6-2-2024 **మచిలీపట్నం.**

పిఎఫ్ కార్యాలయం వద్ద ఇపిఎఫ్ పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : ఎపిఆర్‌పిఎ కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్‌పిఎ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.అజయ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.ఎ.శాస్త్రి, జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం పిఎఫ్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కారక్రమంలో పి.అజయకుమార్ మాట్లాడుతూ ఇపిఎఫ్ సంస్థకు లక్షల కోట్లలో నెలవారీగా కార్మికుల డబ్బు కాంట్రిబ్యూషన్, వడ్డీ రూపంలో జమవుతోందన్నారు. అయినా పెన్షన్ పెంపుదలపై కేంద్ర ప్రభుత్వం నిధులు లేవని సాకులు చెబుతోందన్నారు. గత పదేళ్లుగా కనీస పెన్షన్ పెంచకుండా దుర్మార్గంగా వ్యాహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఎ.శాస్త్రి మాట్లాడుతూ పెన్షనర్ల కనీస కోర్కెలు తీర్చడానికి ముందుకు రాని కేంద్రంలోని మోడీ బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే సార్వాత్రక ఎన్నికల్లో పెన్షనర్లంతా కలిసి ఓడించాలని పిలుపునిచ్చారు. "మాకు పెన్షన్ పెంపు లేదు, కేంద్ర పాలకులైని బిజెపికి ఓట్లు లేదు" అనే స్టిక్కర్లను పెన్షనరలందరికీ ఇచ్చి పచారం చేయాలని కోరారు.

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District
M.V.O.P. No. 81/2023

Between:
Ganja Venkata Durga and Others
(2nd and 3rd Petitioners are being minors represented by their mother and natural guardian Ganja Venkata Durga P1)
...Petitioner
AND
J.Kumar Babu and Others ***...Respondents***

Notice to Respondent:
R-1: J.Kumar Babu, S/o. Venkateswarlu, age 26 years, D.No. 2-196, SC Colony, Ambarupeta, Nandigama, Krishna Dt., Pin: 521185 (Driver of Tanker bearing Regd. No. TS 29 T 4588)

In the above M.V.O.P. No. 81/2023 the 1st Respondent hearing date stand posted **to 22-02-2024 at 10.30 AM** before the 2nd Additional District and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex-party in your absence.

Hearing date: 22-02-2024

N.RAJASEKHAR
Amalapuram Advocate, Amalapuram
Dt. 03-02-2024 Cell: 9849193665

వన్‌స్టాప్ సెంటర్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టీఆర్ జిల్లా మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నడుస్తున్న వన్‌స్టాప్ సెంటర్‌లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి జి.ఉమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్-1, కేసు వర్కర్-2, సైకో-సోషల్ కౌన్సెలర్-1, పూర్తిస్థాయి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన ఆఫీస్ అసిస్టెంట్-1, మల్టీపర్పస్ స్టాఫ్/కుక్-3, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్-3 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు ntr.ap.gov.in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని.. పూర్తిచేసిన దరఖాస్తుకు గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించిన ధ్రువపత్రాల నకళ్లను జతచేసి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, డోర్ నెం: 6-93, కార్మెల్ చర్చి ఎదురు రోడ్, కానూరు, విజయవాడలో ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని సూచించారు.

మొబైల్ కోర్టులో 9 మందికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ సర్కిల్ 2 కార్యాలయంలో జరిగిన మొబైల్ కోర్టులో 9 కేసులు నమోదయ్యాయి. రోడ్డుపై చెత్త వేసినందుకు, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టినందుకు సర్కిల్-2 పరిధిలో ఉన్న శానిటరీ ఇన్స్పెక్టర్లు నమోదు చేసిన 9 కేసులపై మంగళవారం కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి బి.విజయ్ కుమార్ రెడ్డి విచారణ జరిపి రూ.2680 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్-2, డాక్టర్ రామకోటేశ్వరరావు , సానిటరీ సూపర్వైజర్-2 నవ కిషోర్ పాల్గొన్నారు.

స్టాక్ వివరాలను పోర్టల్లో పొందుపరచాలి : జెసి

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ధాన్యం, బియ్యం వ్యాపారులు, రిటైలర్లు, చిల్లర వ్యాపారులు, పెద్ద రిటైలర్లు, ప్రాసెసర్లు/మిల్లర్లు తమ బియ్యం లేదా వడ్లకు సంబంధించిన స్టాక్ వివరాలను అందరికీ అందుబాటులో ఉండేలా https://evegoils.nic.in/rice/login.html లో తప్పనిసరిగా పొందుపరచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్ ఆదేశించారు. స్టాక్ వివరాలను కేటగిరీలు వారీగా అంటే బియ్యం నూకలు, బాస్మతికాని తెల్లబియ్యం, పారా బాయిల్ రైస్, బాస్మతి బియ్యం, వరి వివరాలను పొందుపరచాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్.. తమ కార్యాలయంలో రైస్ మిల్లర్లు, రైస్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు, ధాన్యం, బియ్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెసి సంపత్ కుమార్ మాట్లాడుతూ స్టాక్ వివరాలను ప్రభుత్వ పోర్టల్‌లో విధిగా ప్రతి శుక్రవారం క్రమంతప్పకుండా పొందుపరచాల్సిందిగా సూచించారు. నిర్లక్ష్యం వహించి, ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈసమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జి.మోహన్‌బాబు, ధాన్యం, బియ్యం వ్యాపారులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం -చల్లపల్లి
బహిరంగ వేలం ప్రకటన

తేదీ. 6.02.2024

ది.21.02.2024 మధ్యాహ్నం 3.00 గంటలకు చల్లపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం నకు సంబంధించిన పాత వస్తువులు మరియు పనికిరాని ఇతర వస్తువులుఆసుపత్రి ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. వేలంపాటలో పాల్గొనవారు ధరావత్తు నగదు రూ.1000/-(అక్షరాల వెయ్యి రూపాయలు మాత్రమే) మెడికల్ ఆఫీసర్ సామాజిక ఆరోగ్య కేంద్రం చల్లపల్లి కార్యాలయంలో నగదు చెల్లించవలెను.
షరతులు: 1.పాట పాడుకున్నవారుఅదేరోజు నాగదు చెల్లించాలి. లేనియెడల వేలం రద్దు చేయబడును. ధరావతు సొమ్ము తిరిగి ఇవ్వబడదు.

సం/- కె.జ్ఞానరత్నం, మెడికల్ ఆఫీసర్, సామాజిక ఆరోగ్య కేంద్రం, చల్లపల్లి.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

జవహర్ నవోదయ వార్షికోత్సవంలో కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: పట్టుదల దీక్ష క్రమశిక్షణతో విద్యను సముపార్జించి విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు విద్యార్థులకు సూచించారు. బాపులపాడు మండలం వేలేరు గ్రామంలోని జవహర్ నవోదయ విద్యాలయ 36వ వార్షికోత్సవంలో జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానాతో కలిసి ఆయన పాల్గొన్నారు. అతిథులను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎన్సీసీ క్యాడెట్ల మార్చ్ఫాస్ట్, విద్యార్థులు పూర్ణకలశంతో అపూర్వ స్వాగతం పలికారు.తాము చదువుకున్న స్కూల్ విద్యార్థుల కోసం సోలార్ వాటర్ హీటర్ను కలెక్టర్ ప్రారంభించారు.విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నత్యంతో స్వాగతగీతం, దేశభక్తి గీతాలతో కూడిన నత్యం, ఇతర సాంస్కతి కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. క్రీడలు తదితర పోటీల్లో విజేతలైన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ నవోదయ విద్యాలయం విద్యనభ్యసించిన విద్యార్థులు దేశవ్యాప్తంగా అన్నిరంగాల్లో కీలకస్థానాల్లో ఉన్నారన్నారు.చదువుతో పాటు క్రీడలు, ఇతర సాంస్కతి కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు తమలోని అంతర్గత శక్తిని వెలికితీసి సమున్నత లక్ష్యాలను నిర్దేశించుకుని తదనుగుణంగా క్రమశిక్షణతో సాధన చేస్తే లక్ష్యసాధన మరింత సులభతరమవుతుందని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ పరిస్థితులు అర్థం చేసుకొని సమాజం పట్ల బాధ్యతతో విద్యను అవలంబించాలన్నారు.విద్యతోనే అభివద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరు కూడా ఉన్నత స్థాయి విద్యావంతులు కావలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.విద్యపై మక్కువతో కష్టపడి క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలన్నారు. క్రమపద్ధతిస్వీయ క్రమశిక్షణతో బహిర్గత ఆకర్షణలకు లోనుకాకుండా ఉంటేనే జీవితంలో ఉన్నతశిఖరాలను అదిరోహించవచ్చని తెలుపుతూ చిన్నకథను విద్యార్థులకు చెప్పారు. పట్టుదల,దీక్ష క్రమశిక్షణతో విద్యను సముపార్జించి తమ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని, సమాజం పట్ల బాధ్యతతో వ్యహరించేలా విద్యనభ్యసించాలని డీఈఒ తాహెరాసుల్తానా సూచించారు. నవోదయ విద్యాలయ ఏర్పడటానికి దాతలైన దోనవల్లి గుర్నాధు. బాలమ్మ దంపతుల కషి అభినందనీయమని తెలుపుతూ చాత కుటుంబసభ్యులైన దోనవల్లి లక్ష్మణ్, రామారావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు మండల తహసీల్దార్ శ్రీనివాసరావు,వేలేరు ప్రముఖుడు వేమలపల్లి శ్రీనివాసరావు, ఎం.ఈఒ రాంబాలాసిగ్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక, బుసక తవ్వకాలపై టీడీపీ, జనసేన నేతలు ఘంటసాల మండల తహశీల్దార్, పోలీస్ సిబ్బందికి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ చిన్న మాట్లాడుతూ గత 15 రోజుల నుంచి పాపవినాశనం గ్రామంలోని కృష్ణానది నుంచి భారీ స్థాయిలో ఇసుక రవాణా జరుగుతుంది. ఈ విషయానికి సంబంధించి గతంలో రెవెన్యూ అధికారులను సమాచారం అడిగిన సరిగా స్పందించలేదు. అదేవిధంగా మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో కూడా నిల్వ ఉంచిన ఇసుకను బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీనికి సంబంధించి అనుమతులు ఉన్నాయో లేవో తెలియని పరిస్థితి నెలకొంది. దయచేసి శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల నుంచి బయటకు వెళుతున్న ఇసుక, బుసకకు అనుమతులు ఉన్నాయో లేవో స్పష్టంగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి ఉప సర్పంచ్ కొడాలి లక్ష్మణ్, అత్కురి నాగరాజు, కొల్లా రుచిత్, మాదాసు వినయ్, కోన హరీష్, తాడికొండ సాయి తేజ, కోడి శ్రీనివాసరావు, కుంపటి చిట్టిబాబు పాల్గొన్నారు.

భువనేశ్వరికి స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి గన్నవరం ఎయిర్పోర్ట్లో మంగళవారం స్వాగతం పలికారు. గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ఛార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ఆమెకు స్వాగతం పలికారు. యార్లగడ్డ వెంట ఎమ్మెల్సీ అనురాధ ఉన్నారు.

తహశీల్దార్కు అభినందనలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండల తాశీల్దార్గా బాధ్యతలు చేపట్టిన ఎ.శ్రీనివాస్కు మండల పరిషత్ అధికారులు మంగళవారం మర్యాదపూర్వక అభినందనలు తెలిపారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ఆయనకు ఎంపీడీవో దారపు శ్రీనివాస్, ఇఒపిఆర్డి దిలీప్ కుమార్, ఎంఈఓ 2 గోపాల్రావు, పంచాయతీ కార్యదర్శి ఏజెయల్ నరసింహారావు అభినందనలు తెలిపారు.



పెనుమల్లిలో రాము పర్యటన

ప్రజాశక్తి-పెడన

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గత నాలుగున్నర ఏళ్లుగా రాష్ట్రంలో నిరుపేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందని వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ఉప్పల రాము అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెనుమల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మరొకసారి జగన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. పేదరికమే నిర్మూలన ధ్యేయంగా జగన్ చేపట్టిన పలు పథకాలు కొంతవరకు ఊరటనిస్తున్నాయన్నారు. పోరాటం ఇస్తున్నాయి అన్నారు. మళ్లీ అధికారంలో వస్తే రాష్ట్రంలో ప్రజలందరూ పేదరికం నుంచి జయించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గరికపాటి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ సాగుదారులకు పట్టాలు పంపిణీ

పట్టాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-గన్నవరం: దశబ్దాలుగా అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు శాశ్వత భూహక్కు కల్పించిన ఘనత వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో మంగళవారం తెంపల్లికి చెందిన 14 మంది అసైన్డ్ భూముల సాగుదారులకు భూహక్కు పత్రాలను జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసానితో కలిసి ఎంపీపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ...పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. దీనిలో భాగంగా అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించడం చారిత్రాత్మకమైనదని తెలిపారు. దీనివల్ల 20 ఏళ్ల పూర్తయిన అసైన్డ్ భూముల సాగుదారులకు సర్వహక్కులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పేదలకు ఇంతగా మేలు చేస్తున్న వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. సర్పంచి కొలుసు శిరీష, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదరి జలసూత్రం రామ్మోహన్రావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల జయరాజు, పార్టీ నాయకులు బొమ్మరెడ్డి రాజశేఖర్రెడ్డి, గొన్నూరు, సీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నాల్గో విడత 'ఆసరా' విడుదల

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ పట్టణ, రూరల్ మండలాల పరిధిలో నాలుగో విడత ఆసరా పథకం ద్వారా విడుదలైన రూ.5.62 కోట్ల జంబో చెక్కును మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) విడుదల చేశారు. మంగళవారం స్థానిక ఎన్టిఆర్ స్టేడియం ప్రాంగణంలో 698 గ్రూపులలోని 6,932 మంది సభ్యులకు విడుదలైన చెక్కును ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కొడాలి నాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుబ్రమణ్యం, పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, ఎంపిపి గద్దె పుష్పరాణి, వైస్ ఎంపిపి బట్టు నాగమల్లేశ్వరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-పమిడిముక్కల: శాంతి భద్రతల పరిరక్షణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పమిడిముక్కల ఎస్ఐ కుడిపూడి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని వీరంకిలాకు పోలీస్స్టేషన్లో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల. లో పనిచేసిన తాను పమిడిముక్కల బదిలీపై వచ్చానని తెలిపారు. పోలీస్ సిబ్బంది, అధికారులు, పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

టిడిపి, జనసేనతోనే అభివృద్ధి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం బుద్ధవరం, అజ్జంపుడి, బుతిమిల్లిపాడు గ్రామాలలో ప్రజలతో ఆత్మీయ సమావేశం మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఈ గ్రామాల్లో బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని గన్నవరం మండల పార్టీ ఆధ్వర్యంలో జరిపారు. ముఖ్య అతిథిగా గన్నవరం నియజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివద్ధి చెందుతుందని అందుకు ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా చంద్రబాబు నాయుడు తీసుకువచ్చిన మేనిఫెస్టోలోని విషయాలను ప్రజలకు తెలపాలని యార్లగడ్డ వెంకట్రావు కోరారు. అనంతరం గ్రామాల్లో వీధుల గుండా, ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ తెలుగుదేశం పార్టీ ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు లి"సూపర్ సిక్స్ పథకాలు"లి ద్వారా ప్రయోజనాలను బాబు షఉ్యరిటీ భవిష్యత్తు గ్యారంటీ బాండ్లలో వారికి వచ్చే ఆర్థిక ప్రయోజనాలు నమోదు చేసి ఆ బాండ్ ను కుటుంబ పెద్దకి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చాలామలశెట్టి రమేష్ గన్నవరం మండల పార్టీ అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరావు, గన్నవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమాదేవి, ఉంగుటూరు మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్య, కాజా రామకృష్ణ, ఎర్రబాబు, ప్రసాద్, మండవ లక్ష్మి, వెంకటేశ్వరావు, శాంతమ్మ, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు మండవ అన్వేష్, కంచర్ల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : నజ్మా

ప్రజాశక్తి-ఉంగుటూరు: మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా వ్యసనం ఒక మానసిక రుగ్మత అని నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ షేక్ నజ్మా అన్నారు మంగళవారం పెద్ద అవుటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన వర్క్ షాప్లో నజ్మా మాట్లాడుతూ మాదకద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని అంతేకాక నిత్యజీవితంలో చాలామంది విద్యార్థులు, యువత బానిసలై వారి జీవితాలను మత్తుకు అంకితం చేస్తున్నారని చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. ఇలాంటి వారిని కౌన్సిలింగ్, డిఎడిక్షన్ సెంటర్లకు పంపించాలన్నారు. ఇందుకోసం 949042020 నెంబర్ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ డి విజయరాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, ఫిలోమిన, సుప్రియ జీవకాంత్ పాల్గొన్నారు.

ఉయ్యూరు తహశీల్దార్గా గురుమూర్తిరెడ్డి

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరు మండల తాసిల్దార్ గా గురుమూర్తిరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని ప్రభుత్వం చేపట్టిన అధికారుల బదిలీలల్లో భాగంగ గురుమూర్తిరెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు తహసీల్దార్గా ఉన్న మస్తాన్ గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గురుమూర్తి రెడ్డిని వీఆర్వోలు, వీఆర్ఎలు, రెవిన్యూ సిబ్బంది కలసి పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.



మాదక ద్రవ్యాలపై అవగాహన

విజయవాడ : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విజయవాడ స్థానిక రాజీవ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాప్ కార్యక్రమాన్ని మంగళవరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ నజ్మా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా వ్యసనం ఒక మానసిక రుగ్మత, అని సరి అయిన అవగాహనతో ఈ రుగ్మతలను కట్టడి చేయవచ్చని అన్నారు. మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, అంతేకాక మనం నిత్యజీవితంలో చాలా మంది విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలైపోతున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని ముందుగా గుర్తించి, సరైన అవగాహన, కౌన్సెలింగ్, డి అడిక్షన్ సెంటర్లకు పంపించాలని ప్రతి ఒక్కరు తమ వంతు సామజిక బాధ్యతగా తీసుకుంటే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చని అన్నారు. నూజివీడు మండలం పొనసనిపల్లిలో ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ ఏర్పాటు చేసిన బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఉన్నాయి అని, ఇలాంటి సమస్యలతో ఉన్న వారు 9490492020 నెంబర్‌కు సంప్రదించొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.వంశీ లాల్ రాథోడ్ ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు

49వ డివిజన్లో వైసిపి పశ్చిమ ఇన్చార్జి ఆసీఫ్ పర్యటన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ, పశ్చిమ నియోజక వర్గం 49వ డివిజలో వైసిపి పశ్చిమ నియోజక వర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రతి గడప గడపకు షేక్ ఆసీఫ్ తిరుగుతూ ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశిం చారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలలో తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ అసిఫ్‌తో పాటు స్థానిక కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్స్, దుర్గా కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జైపూర్ శ్రీనివాసరావు, 49వ డివిజన్ వైసిపి ప్రెసిడెంట్ గౌడ్ రూపాయి ట్రస్ట్ చైర్ పర్సన్ ఎర్ర జొన్న విజయలక్ష్మి, వైసిపి 49వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు తంగిరాల ప్రమీల, వైసిపి రాష్ట్ర దళిత నాయకులు దాసి జయప్రకాష్ పాల్గొన్నారు.

సర్పంచ్ గృహ నిర్బంధం

ప్రజాశక్తి - కంచికచర్ల : గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు విడుదల చేయాలని సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి సిద్ధమ వుతున్న సర్పం చ్‌లను మంగళవారం హౌస్ అరెస్టులు చేశారు. మంగళవారం ఉదయం కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామంలో సర్పంచ్ మన్నే సాత్విక ఇంటికి వెళ్లిన పోలీసులు అసెంబ్లీ ముట్టడికి అనుమతి లేదని, సాయంత్రం బయ టకు రావద్దని ముందస్తుగా ఆమెను గృహ నిర్బంధం చేశారు. దీంతో ప్రభుత్వం తీరును ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు రావాల్సిన నిధులను, నిర్వీర్యం చేసిందని ఆరోపించారు.

పలు అవార్డులు సొంతం చేసుకున్న సింధూశ్రీ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పటమట అయ్యప్పనగర్ గణేష్ వీధిలో నివసిస్తున్న మేడా సింధూశ్రీ క్రాఫ్ట్ వర్క్స్ చేయడంలో ఎంతో పేరుగడించింది. చక్కని బొమ్మలతో ఎంతో మంది ప్రశంసలు, మహానంది జాతీయ స్థాయి అవార్డు కూడా ఇటీవలే సాధించింది. సింధూ శ్రీ తల్లి మేడా రజని క్వీన్‌ఆఫ్ క్రాఫ్ట్‌గా పేరుగాంచిన ప్రముఖ క్రియేటివ్ క్రాఫ్ట్ టీచర్. బాల్యం నుండి తల్లి చేస్తున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వర్క్స్‌ను చూసి ఇన్స్పిరేషన్ పొంది నాన్న మేడా సతీష్ ప్రోత్సాహంతో సింధూశ్రీ పెంయింటింగ్‌లు వేయడం ప్రారంభించింది. పనికిరాని పేపర్లతో క్విల్లింగ్ వర్క్ చేయడం, తల్లిదండ్రుల సలహాలతో క్రియేటివ్ క్రాఫ్ట్ వర్క్స్ చేయడంతో తన ప్రతిభతో అద్భుత కళాఖండాలను రూపొందించింది. పలు రాష్ట్రస్థాయి, పోటీల్లో పాల్గొంటూ బహుమతులు సాధించి ఎంతో మంది నుండి అభినందనలు పొందింది సిందూశ్రీ. చదువుకుంటూనే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నేర్చుకోవడం తన రెగ్యులర్ స్టడీస్‌కి బాగా ఉపయోగపడుతుందని సైన్సు బొమ్మలు వేయడానికి రికార్డ్సు, ప్రాజెక్టు వర్క్ చేయడానికి ఈక్రియేటివ్ స్కిల్స్ చాలా దోహదం చేస్తున్నాయని సిందూశ్రీ ప్రజాశక్తికి తెలిపింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువులు స్ఫూర్తి శ్రీనివాస్, ఎస్.పి.మల్లిక్‌ల సలహాలతో వివిధ రకాల ఆర్ట్, క్రాఫ్ట్ , ఫోటోగ్రఫీ కాంటెస్టులు ఎగ్జిబిషన్‌లలో పాల్గొని ప్రశంసాపత్రాలను సాధించినట్లు తెలిపింది. తన కాళ్ల మీద తాను స్వయంగా నిలబడాలనే ఉద్దేశంతో 'సిందూ ఆర్ట్స్' పేరుతో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఆర్డర్లు తీసుకుని ఖాళీ సమయాలలో చేసుకుంటూ తన కాలేజీ ఫీజులు తానే కట్టుకుంటూ పలువురికి ఆదర్శవంతంగా నిలుస్తుంది. స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్, ఫోరం ఫర్ ఆరిస్టు, జాషువా సాంస్కృతిక వేదిక సంస్థల ప్రోత్సాహంతో ఉగాది వేడుకలు, ఫోటోగ్రఫీ దినోత్సవం, దసరా సాంస్కృతికోత్సవాలు, ఆర్ట్ ప్యారెడైజ్ వంటి పోటీల్లో పాల్గొని ప్రసంసా పత్రానలు సాధించినట్లు సింధూశ్రీ తెలిపింది. ఇటీవలే తెలంగాణ రాష్ట్రంకు చెందిన యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ద్వారా మహానంది జాతీయస్థాయి పురస్కారం లభించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో ఉత్తమ చిత్రకారిణిగా పేరు సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు తెలిపింది.

గుణదల కొండపై రద్దీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గుణదల కొండపై కొలువైన లూర్ధుమాత తనను ఆశ్రయిస్తున్న వారి మానవులను ఆలకిస్తూ తన అనుంగ బిడ్డలుగా ఆదరిస్తూ యాత్రికుల పాలిట దీవెనల సిరిగా వెలుగొందుతుందని హైదరాబాద్ పునీత యోహాను ప్రాంతీయ గురు విద్యాలయం రెక్టర్ రెవరెంట్ ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి అన్నారు. గుణదల మాత శతాబ్ధి మహోత్సవ నవదిన ప్రార్ధనల్లో భాగంగా మంగళవారం సాయంత్రం జరిగిన 7వ రోజు నవదిన ప్రార్ధనలకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు సందేశమిస్తూ మరియతల్లి దేవునితల్లి అయినప్పటికీ ఏసుప్రభువు పట్ల ఎపుడూ వినయ విధేయలతో భక్తి శ్రద్దలతో మెలిగిందని తెలిపారు. ఆమెను మధ్యస్థ ప్రార్ధన ద్వారా భక్తులమైన మనం దేవుని చేరుకోవచ్చని తెలిపారు. విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ రెవరెంట్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి మాట్లాడుతూ గత ఏడురోజులుగా అనేక ప్రాంతాల నుండి అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు నవదిన ప్రార్ధనలలో పాల్గొని గుణదల మాత చల్లని దీవెనలు పొందుతున్నారని అన్నారు. అనంతరం పలువురు గురువులు దివ్యసత్ప్రసాదంతో కొండపైకి లూర్ధుమాత వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొలకాని మరియన్న, ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప, ఫాదర్ కారెం శేఖర్. ఫాదర్ బి.రాజు, మఠకన్యలు పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమి విద్యార్థులు రిత్విక్, హర్షిత్ సాయిలకు ఫిడే చెస్ అత్యున్నత రేటింగ్ లభించిందని అకాడమి అధ్యక్షులు బి.రత్నారావు తెలిపారు. నగరంలోని అకాడమి కార్యాలయంలో ఫిడే చెస్ రేటింగ్‌లో అత్యుత్తమ రేటింగ్ సాధించిన క్రీడాకారులకు అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయపవర్ సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ వేములపల్లి సోమశేఖర్, ఎపిఐఐసి జనరల్ మేనేజర్ సిహెచ్.లక్ష్మీదుర్గ ముఖ్య అతిథులుగా పాల్గొని రిత్విక్, హర్షిత్ సాయిలను అభినందించారు. భవిష్యత్తులో మంచి రేటింగ్ సాధించి జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులుగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని అభినందించారు. ఈ సందర్భంగా వారికి చెస్ క్లాక్‌లను అందచేశారు. అకాడమి చీఫ్ కోచ్ వి.ఆర్.బొబ్బా మాట్లాడుతూ ఇటీవలే ఫిడే రేటింగ్‌ను ప్రకటించగా తమ అకాడమి విద్యార్థులు రిత్విక్‌కు 1088, హర్షిత్ సాయికి 1072 ర్యాంకింగ్ ప్రకటించారని తెలిపారు. వీరిద్దరూ ఇటీవల హైదారబాద్, ఉదయ్‌పూర్‌లో జరిగిన ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని మంచి ప్రతిభ చూపడం కారణంగా వారికి అత్యుత్తమ రేటింగ్ ఇచ్చారని తెలిపారు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎ.పద్మారావు, చిల్లకల్లు ఎస్ఐగా సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా వచ్చిన వీరిని స్టేషన్ సిబ్బంది వారిని అభినందించారు.

పిల్లల్లో ఆసక్తిని పెంచుతున్న వృత్తి విద్యా కోర్సులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నడపబడుతున్న వత్తివిద్యా కోర్సుల్లో భాగంగా లెర్నట్ స్కిల్స్ వారి సహకారంతో జడ్‌పిహెచ్ పాఠశాల మూలపాడు నుండి 9, 10 తరగతి విద్యార్థులు నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. వారికి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.డేవిడ్ రాక్ ఫెల్లర్ మాట్లాడుతూ ఇటువంటి కోర్సులు పిల్లల్లో ఆసక్తిని పెంచుతున్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ (డాక్టర్ అక్బర్ ఖాన్) ఇటువంటి అనుబంధ కోర్సులు పాఠశాల స్థాయి నుంచే నేర్పించడం వల్ల సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుంది. తద్వారా వారు భవిష్యత్తులో స్థిరపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన శిక్షకులు నాగేశ్వరరావును ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

నేడు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం శాశ్వత భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అమరావతి, రాయపూడి గ్రామంలో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి విజయవాడలో ప్రాంతీయ కేంద్రం శాశ్వత భవన నిర్మాణానికి సంకల్పించింది. దీనికోసం అమరావతి, రాయపూడి గ్రామంలో ప్రభుత్వం నుండి భూమిని కొనుగోలు చేసి, ఫిబ్రవరి 7న కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా ఆన్‌లైన్ వేదికగా శంకుస్థాపన చేయనున్నట్లు విజయవాడ ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డా.కె.సుమలత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడతో పాటు దేశంలోని మరో ఆరు ప్రాంతీయ కేంద్రాల శాశ్వత భవనాల ప్రారంభోత్సవం కూడా ఆన్‌లైన్ విధానంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై గుర్తు తెలియని వ్యక్తి దాడి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని పితాని అప్పల స్వామి వీధి రాజా హైస్కూల్ పక్కన నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ జగదీశ్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనను సంబంధిత బాధిత ఆటో డ్రైవర్ తెలిపిన వివరాల మేరకు నిత్యం రద్దీగా ఉండే వన్‌టౌన్ నెహ్రూ బొమ్మ సెంటర్ సుధా బార్ పక్కన మెడికల్ షాప్ వద్ద ఈ నెల 4వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ జగదీష్ తన ఆటోను రాజా హైస్కూల్ పక్కన సందులో పార్కు చేసి సుధా బార్ పక్కన మెడికల్ షాప్‌లో మందులు కొనుక్కుందామని వెళు _ఒడగా గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుండి మెడపై కత్తితో నరకటానికి ప్రయత్నించాడు. మెడికల్ షాప్‌లో ఉన్న ఓనర్ ఇది గమనించి అరవగా వెనుకకు తిరిగి చూసేసరికి ఆటో డ్రైవర్ జగదీష్‌పై కత్తితో దాడి చేశాడు. వెంటనే ఆటో డ్రైవర్ జగదీష్ చేతులు అడ్డుపెట్టుకోవటంతో చేతులకు కత్తిపోట్ల గాయాలయ్యాయి. సంబంధిత గుర్తు తెలియని వ్యక్తి పరారైనట్లు బాధితుడు తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆటో డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.